కాలనీలను ఎంతో అభివృద్ధి చేశాం

అసోసియేషన్ల నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి వివిధ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఇందు, 5వ ఫేజులోని కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ డివిజన్ ఏ విధంగా అభివృద్ధి చెందిందో వివరించారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి చేశామన్నారు.భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒక ప్రణాళికాబద్ధంగా డ్రైనేజీ వ్యస్థను చేస్తున్నామన్నారు. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ముందు చూపుతోనే ప్రజలకు నీటి సమస్య లేకుండా ఎక్కడికక్కడ లక్షల గ్యాలన్లతో రిజర్వాయర్లు నిర్మించి మౌలిక సదుపాయాలైన పార్కులు, రోడ్లు వంటివి ప్రజలకు చేసి చూపించామన్నారు.

◆ అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు ఇక్కడ చూస్తున్న అభివృద్ధి చూసి వారి సొంత ఊర్లకు వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదన్నారు. దీన్ని బట్టి ఎంత అభివృద్ధి చెందిందో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. నిత్యం శాంతి భద్రత పరిరక్షణలో ఉండే హైదరాబాద్ మహానగరానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టి వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. తిరిగి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను, ఎమ్మెల్యేగా నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్‌నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో...

◆ కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టే బీజేపీ పార్టీ, అమలు కాని హామీలతో అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేసే కాంగ్రెస్ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి కాలనీ అసోసియేషన్ నాయకులు, ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని, అన్ని ప్రాంతాల వారిని సమానంగా చూపించి దేశంలో అగ్రగామిగా నిలిపిన ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అదే విధంగా ముస్లిం మైనార్టీలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఇమామ్‌లకు కనీస వేతనాన్ని చెల్లిస్తోందన్నారు. మైనార్టీ పాఠశాలలు, మైనార్టీలకు సంక్షేమ పథకాలు, షాదీ ముబారక్, గ్రేవ్ యార్డులు ఏర్పాటు చేశామన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల్లో నియోజకవర్గ ప్రజలను పట్టించుకోలేదన్నారు. అబద్ధాల, బూటక ప్రచారాలు తప్ప ఆయన రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.



బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే సమక్షంలో చేరిన నాయకులు, కార్యకర్తలు

బీజేపీకి బిగ్‌షాక్...

◆ బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ముఖ్య అనుచరురుడు,మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ సోషల్ మీడియా అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ మూసాపేట బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగమ్మ తమ అనుచరులు 100 మందితో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.





కేపీహెచ్‌బీ, అల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలు అసోసియేషన్ నాయకులతో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు తదితరులు



బీఆర్ఎస్‌లో చేరిన లోక్‌సత్తా పార్టీ నాయకులు

12 మంది నామినేషన్ల తిరస్కరణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన వారి నుంచి 12 మంది అభ్యర్థులు నామినేషన్లను సోమవారం ఎన్నికల అధికారి రద్దు చేశారు. పలు కారణాల వల్ల సరైన పత్రాలు దాఖలు చేయని అభ్యర్థుల నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. వీరిలో జై మహాభారత్ పార్టీ అభ్యర్థి ఎం. బాలామణి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉమాశంకర్, ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి. సతీష్ కుమార్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అభ్యర్థి బాలాజీ మనోహర్, జనతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీహెచ్ పావని, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) అభ్యర్థి ఆరిఫ్ హుస్సేన్, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ అభ్యర్థి గాడి వినోద్‌కుమార్, ఇండియన్ బిలీవర్స్ పార్టీ అభ్యర్థి గడ్డం సైమన్‌పీటర్, యుగతులసి పార్టీ అభ్యర్థి కె. వెంకట బాబీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎండీ ఫయాజ్, దినేష్ కలాం, సూరారం శ్రీనివాస్ ముదిరాజ్‌ల నామినేషన్లను తిరస్కరించామని ఎన్నికల అధికారి తెలిపారు.

మాధవరం కృష్ణారావును గెలిపించండి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలో సోమవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణతో హ్యాట్రిక్ సాధిస్తాం

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో రోజు రోజుకు బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ప్రజాదరణ పెరుతోందని... హ్యాట్రిక్ సాధిస్తారని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని నాగిరెడ్డి కాలనీ, జాగృతి ఎన్‌క్లేవ్, ఆర్ఆర్ టౌన్‌షిప్, మణికంఠ కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల సత్యనారాయణ, ఎనుగుల తిరుపతి, మన్నె ఉదయ్‌యాదవ్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సంకినేని శ్రీధర్‌రావు



సంకినేని శ్రీధర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన శంభీపూర్‌రాజు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ప్రగతి విద్యా సంస్థల అధినేత, మాజీ టీడీపీ నాయకులు సంకినేని శ్రీధర్ సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. అభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. తనతో పాటు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. ఈ కార్యక్రమంలో రత్నాజీ, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, దినేష్, శివ, సాయిరామ్, దేవరాజ్, కెవెన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన 35మంది యువకులు

మూసాపేట: మూసాపేటకు చెందిన జగన్‌తో పాటు మరో 35 మంది మూసపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూము నిఖిల్ కుమార్, వీరాచారి, ప్రవీణ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మక్కాల సత్యానారాయణ



హోమం నిర్వహిస్తున్న మక్కాల సత్యనారాయణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమవాస్య సందర్భంగా అంజయ్యనగర్ రిటైల్ మార్కెట్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు నిర్వాహించారు. ప్రతి అమవాస్య ఆలయంలో నిర్వహించే పూజలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం నిర్వాహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రతి అమవాస్యకు అన్నదానం పూజలు, హోమాలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పీఎస్ఎన్ రెడ్డి బ్యాటరీ సెంటర్ నిర్వాహకులు పి. సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. దీపావళి పండుగ సందర్భంగా మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులోని బీఎస్ఎన్‌రెడ్డి బ్యాటరీ సెంటర్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజాభివృద్ధికి వెచ్చిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు కరోనా విపత్తు సమయంలో వారు చేసిన సేవలు అమోఘమని తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేసిన బీఎస్ఎన్ రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



బాలాజీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ టి. అంజయ్యనగర్, సాయిబాబానగర్, ప్రగతినగర్, ముష్కిపేట, చిత్తారమ్మ బస్తీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ తూము వేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు దగ్గర పడే కొద్ది బీఆర్ఎస్ నాయకుల్లో ఓడిపోతామనే భయం మొదలైందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణారావు ఏమి అభివృద్ధి చేశారన్నారు. 100 కడకల ఆస్పత్రి కట్టించారా.. నిరుద్యోలకు ఉపాధి కల్పన కల్పించారా..., డబుల్ బెడ్ రూమ్ పథకం పెట్టినప్పుడు భూమి రేటు ఎంత.. ఇప్పుడెంత? పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు అందించక వారికి నష్టం చేకూర్చే విధంగా చేశారు.

◆ అదే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా.. విద్యార్థులను చదువుకోనివ్వకుండా చేసి.. బినామీల ప్రైవేట్ కాలేజీలకు పర్మిషన్ ఇచ్చి విద్యను అంగట్లో సరుకులాగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. తల్లిదండ్రులు వారి స్థిరాస్తులు అమ్ముకొని ఫీజు కట్టి చదివిస్తే వారికి ఉద్యోగం ఇవ్వక, వాటిని అమ్ముకొని తప్పిదాలు సృష్టించి మళ్లీ మీరే కోర్టు కేసులు వేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగం రాక విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు భరోసా ఇస్తుందన్నారు. ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌పార్టీని ఆకాశానికి ఎత్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహిన్, కృష్ణ, మారుతీ, హరి, శంకర్, రమేష్, అక్బర్, జహంగీర్, జాహిర్, కిరణ్, అంజి, అల్లాద్దీన్, మహేష్, హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



పాండు రంగానగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్

మూసాపేటలో బీఆర్ఎస్ ఖాళీ...

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బండి రమేష్ చేపట్టారు. ఈ సందర్భంగా పాండురంగానగర్‌కు చెందిన సుమారు 100 మంది ముఖ్య కార్యర్రతలు బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, రాఘవేందర్, డివిజన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, సంతోష్, మహిళా అధ్యక్షురాలు బోజమ్మ, యూత్ అధ్యక్షుడు సచిన్, సుధాకర్‌రెడ్డి, మోసిన్, పాషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకే మా మద్దతు

వెంకటేశ్వరనగర్ నగర సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీకి జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్ సగర సంఘం మద్దతు తెలుపుతూ చేసిన తీర్మానం పత్రాన్ని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి గాంధీకి ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ గాంధీనే మళ్లీ గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి తనను మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మున్నూరు కాపు సంఘం మద్దతు....

ఆల్విన్‌కాలనీ: వెంకటేశ్వరనగర్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకే సంపూర్ణ మద్దుతు తెలిపారు. సోమవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఆధ్వర్యంలో అరెకపూడి గాంధీకి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో హెచ్‌యంటీహిల్స్ కాలనీలో సోమవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ, పీజేఆర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌యస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సోమవారం ఎన్నికల కార్యాచరణపై స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ చర్చించారు.బీఆర్‌యస్ పార్టీ విజయం కోసం సమిష్టిగా పనిచేసి గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. పోలింగ్ బూత్‌లలో ఇన్‌చార్జిలను నియమించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాద్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, జగదీష్, వెంకటేష్, రాములుగౌడ్, మల్లేష్, అంబా భవాని, అరుణకుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కంటెస్టెట్ కార్పొరేటర్ నాగమణి యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌యస్ నాయకులు భారతమ్మ, శివరాత్రి రవికుమార్, కృష్ణస్వామి తదితరులు శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మీ పథకం, రైతు భరోసా, గృహలక్ష్మీ, యువ వికాసం, వృద్ధులకు, వికాలంగులకు చేయూత, 6 గ్యారంటీ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్, చిరుమర్తి రాజు, రాజు,గల్లా రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీ మాసోత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణసూరి తెలిపారు. ఈ నెల 20న మొదటి సోమవారం సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, 22న దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, లక్ష దీపారాధన మహోత్సవం, 27న రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, 30న సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతి అభిషేకం, డిసెంబర్ 1న మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశ్వేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, 11న మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, కాశీవిశాలాక్షి విశ్వేశ్వర స్వామి కల్యాణం, వనభోజనాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

మోతీనగర్: పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామి వారి కార్తీక మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వీఎన్‌వీ సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏజీకే కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30గంటలకు గణపతి పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 7 గంటలకు అభిషేకాలు, అర్చనలు, సాయంత్రంగ 6.30 గంటలకు అర్చనలు, 26న ఉదయం 10 గంటలకు మహా లింగార్చన, 27న కార్తీక పౌర్ణమి సందర్భంగా గణపతి పూజ,దీపోత్సవం డిసెంబర్ 11న సోమవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

◆ అదే విధంగా రామారావు నగర్, స్నేహపురి కాలనీలోని శ్రీవినాయక శివపార్వతుల ప్రసన్నాంజనేయ నవగ్రహ నాగ దేవత ఆలయంలో ఈనెల 14 నుంచి కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు పురోహితులు శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు ఆకాశ దీపారాధన కార్యక్రమంలో ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మూసాపేటలో సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న యాదవ కుల పెద్దలు

సదర్ షురూ..

మూసాపేట: మూసాపేటలో సదర్ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మూసాపేటలోని యాదవ కుల పెద్దలు మూసాపేట చౌరస్తాలో పటం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవులు దున్నపోతున్న ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్ కుమార్, బాబూరావులు పూజలు చేశారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

పోస్టును తొలగించాలి: బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక



ఎమ్మెల్యే గాంధీ నివాసంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న చంద్రారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్‌యాదవ్ ఆదివారం కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన సీనియర్ నేతలు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఊట్ల చంద్రారెడ్డిలను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ఇదే అదనుగా తీసుకొని రవికుమార్ సోషల్ మీడియాలో భాస్కర్‌రావు, చంద్రారెడ్డిలు బీజేపీలో చేరినట్లు.. తనకు మద్దతును ప్రకటించినట్లు పెట్టారు.

◆ ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే గాంధీ నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. పెట్టిన పోస్టును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మరో మారు ఇటువంటి చిల్లర రాజకీయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మరో మారు బీఆర్ఎస్ జెండా ఎగరటం ఖాయమని స్పష్టం చేశారు. సమావేశంలో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, నాయకుల సంజీవరెడ్డి, మొగుళ్ల కనకారెడ్డి, ఆంజనేయులు, భగవంత్ రెడ్డి, నరసింహులు, విద్యాసాగర్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

తుది గడువు నవంబర్ 20

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయం 2023–24 విద్యా సంవత్సరానికి గాను పీహెచ్‌డీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.గీతం హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూరు ప్రాంగణాలలో ఇంజినీరింగ్,సైన్స్, ఫార్మసీ ,మేనేజ్‌మెంట్, హ్యుమానిటీస్, న్యాయశాస్త్రం, పబ్లిక్ పాలసీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఈ కోర్సుల్లో చేరిన పరిశోధక విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు, నెలవారీ రూ.40 వేల మూర్తి ఎక్సలెన్స్ ఫెలోషిప్, పత్ర సమర్పణ, వివిధ సదస్సులలో పాల్గొనడానికి వీలు కల్పించడంతో పాటు, ఇంటర్న్‌షిప్ టీచింగ్ అసిస్టెంట్ల ద్వారా 'చదివేటప్పుడే సంపాదించుకునే' అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.ఆయా కోర్సులకు దరఖాస్తు చేయాలనుకునే వారికి సంబంధిత డొమెన్‌లో కనీసం 75 శాతంతో నాలుగేళ్ల డిగ్రీని కలిగి ఉండాలని, లేదా సంబంధిత డొమెన్ మాస్టర్స్‌లో మూడేళ్ల డిగ్రీని 55 శాతంతో కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా సమర్పించాలని, ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్‌లో డిసెంబర్ 10న నిర్వహిస్తామని, తుది ఫలితాలను జనవరి 12, 2024న వెల్లడిస్తామని తెలియజేశారు.

ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను గెలింపించాలి

మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్, పన్నాల హరీష్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ సోమవారం కేపీహెచ్‌బీకాలనీ మలేసియా టౌన్‌షిప్ ప్రాంతంలో బీజేపీ, జనసేన నాయకులతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కబ్జారావు అని విమర్శించారు. నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ప్రజలు బీజేపీ, జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. పాదయాత్రలో ప్రజల నుంచి అనేక సమస్యలు తెలుసుకున్నామన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను భారీ ఎత్తున ఓటు వేసి గెలిపించాలన్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లాస్ట్‌బస్టాప్ దగ్గరలోని హనుమాన్ ఆలయంలో జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. యాదవబస్తీ, మల్లికార్జుననగర్ కాలనీ, ఆర్ఆర్‌నగర్, గౌరినగర్, విఠల్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో ప్రచారం చేశారు.

ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నామని పార్టీ సీనియర్ నాయకుడు నల్లోల రాజేందర్ తెలిపారు. ఈసారి కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం డివిజన్‌లోని వల్లభ్‌నగర్, బడేగూడలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు.

ఎలక్ట్రోడ్ పదార్థాల అభివృద్ధిపై హెచ్‌సీయూ, టీఐఎఫ్ఆర్ పరిశోధన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ– టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ హైదరాబాద్ (టీఐఎఫ్ఆర్)లు మరింత సహకారంతో పనిచేయాలని నిర్ణయించాయి. అందులో భాగంగా సోడియం–అయాన్ బ్యాటరీల కోసం ఫాస్ట్‌చార్జ్–డిశ్చార్జ్ ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్లు ఉన్న ఎలక్ట్రోడ్ పదార్థాలను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేశాయి. ఈ రెండు సంస్థల ప్రతినిధులు కలిసి చేసిన పరిశోధనను జర్నల్ ఆఫ్ ఎనర్జీ స్టోరేజ్‌లో ప్రచురించడం విశేషం.